# చుక్కా.. చుక్కా!

"బాపూ! తవరింట్లో పని పిల్లగాని గావాల్నా...?" అరుగు మీద కూర్చొని పిల్లలకు పాఠాలు చెబుతూన్న నేను ఆశ్చర్యంగా తలెత్తిచూశాను. మా ఇంటి ముందు ఓ నల్లటి మనిషి సన్నగా పొడుగ్గా వెదురు బద్దలా ఉన్నాడు. మొల చుట్టూ గళ్ల లుంగీ లాంటిది కుట్టుకున్నాడు. తలకు తెల్లటి పాగా చుట్టుకున్నాడు. భుజం మీద ఓ తుండు గుడ్డ వేసుకున్నాడు. చేతిలో గోనె గుడ్డతో కుట్టిన చిన్న సంచీ ఉంది...

ఆ నల్లటి మనిషి పక్కనే. అతని చేయి పట్టుకుని పదేళ్ల వయసుంటుందేమో ఆపిల్లకు. " ఇంటి పనంతా సేత్తాది బాపూ, అంట్లు తోముతాది. కసపూడుత్తాది. నీళ్లతోడి గదులన్నీ అద్దం నాగ కడుగుతాది. మీరీదిలో కెల్తే కుక్కనాగ మీ ఇంటికి కాపలా గుంటాది. ఏటి బాపూ? అలగ సూత్తన్నరు? నానేవీ మందులోడ్నీ మాయలోడ్ని కాదు. నాపేరు సింవాద్రి. మాది నర్సీపట్నంలే. కడుపులు కాల్తుంటే, కూలి పన్లేవన్నాదొరకతయ్యని ఈ వూరల్ల కొచ్చీసినాం.

"సిత్రాడ సెరువు కాడ సిన్న గుడిసె అద్దెకుచ్చుకోని అందల తలదాసుకున్నాం. ఈ బొట్టె పేరు సుక్క. నా కూతురే బాపూ, దీనమ్మకు ఒంట్లో బాగునేదు. రెండొందలు రొక్కంగావాల్న. ఈ సుక్కని మీ కాడ పనిల ఎట్టుకోండి. రెండొందలిప్పిచ్చి పున్నెం గట్టుకోండి!"

ఆ నల్లటి శాల్తీ విల్లులా నడుం వంచి, రెండు చేతులూ జోడించి ప్రాధేయపడుతున్నాడు. నాకు విషయం అర్థమయింది. ఆ పిల్ల వైపు దృష్టి మరల్చాను. ఒళ్లంతా దుమ్ము కొట్టుకు పోయినట్టుగా ఉంది. పొట్టిలంగా మీద చిరుగుల జాకెట్టు వేసుకుంది. తండ్రిలా నలుపుకాదు. తల్లి పోలికేమో చామన చాయలో ఉంది.చిన్ని చిన్ని కళ్లు, చింపిరిజుట్టు, ముఖం తీరుగా కళగా ఉంది

"అనుమానాం ఏటీ ఎట్టుకో వద్దు బాపూ ! సుక్క తవరింట్లో ఏ పని సెప్పినా సిటంలో సేత్తాది. పిల్ల పని నచ్చులేదంటే సెప్పండి. నెల్రోజులకి నానొచ్చి దీన్నెంట బెట్టుకుని పోతాను. ఏ టాలోచిత్తన్నరు బాపూ?"

నేనింత సేపూ ఆలోచించడానికీ, ఆ శాల్తీ మాటలు వినడానికీ కారణం ఉంది. మా కో పని పిల్ల అవసరం ఉంది. 'వంశీగాడు పుట్టినప్పటి నుంచీ శ్రీమతి పని పిల్లకోసం ప్రయత్నం చేస్తూనే ఉంది. ఆవిడసలే సుకుమారి చిన్న పని చేసినా అలసి పోతుంది. చీటికి మాటికీ చికాకు పడిపోతుంది. మాతో ఉండటానికి అత్తగారిది మంచం దిగలేని పరిస్థితి. అమ్మది నాన్నని విడిచి పెట్టడానికి వీలు లేని స్థితి. ఆదీగాక, అప్పుడెప్పుడో, వీధి చివర 'అరవింద' కాన్వెంటులో శ్రీమతి అయిదు వందలకి ఉద్యోగం చేసేది. వంశీ పుట్టడంతో ఆ ఉద్యోగానికి వీడ్కోలు చెప్పవలసి వచ్చింది. వాడి కిప్పుడు సంవత్సరం నిండుతోంది. ఆ కాన్వెంటు వాళ్లు శ్రీమతిని మళ్ళీ వచ్చి చేరమని కబురు మీద కబురు పంపించడం

ఆవిడకు ఉద్యోగం చేయాలనే ఉత్సాహానికి ఊపిరి పోస్తోంది. అందువల్ల వంశీగాడ్ని ఇంటిని కనిపెట్టుకుని ఉండటానికి, మాకో పని పిల్ల అవసరం ఎంతైనా ఉంది.!

నేనో ప్రశ్న అడిగే లోపుగానే మా ఆవిడ వంశీ నెత్తుకుని ఇంట్లోంచి అరుగు మీదకు వచ్చింది. ఇంటి ముందునిలబడ్డ గెడ కర్రలాంటి మనిషినీ, దిష్టి బొమ్మలాంటి ఆ పిల్లనీ ప్రశ్నార్థకంగా చూసింది. నేను విషయం వివరించి చెప్పాను. శ్రీమతి నిశితంగా ఆ పిల్లని పరికించి సందేహంగా అడిగింది.

" నీ పేరేవిటే? పనిచేస్తావా?"

" ఈబొట్టె సుక్క తల్లీ! నాను సింహాద్రిని. దీనమ్మకు ఒంట్లో బాగులేక దీన్ని పనిల ఎడతన్నాను గానీ... సుక్కా! అమ్మగోరికి దణ్ణంవెట్టే!" సింహాద్రి చుక్కతో రెండు చేతులూ కలిపి శ్రీమతికి దండాలు పెట్టించాడు.

" సరే! ఇప్పుడు వందరూపాయలు ఇస్తాను. నెల రోజుల తర్వాత రా మిగతా వందా ఇస్తాను. ఇదే పాటి పనిచేస్తుందో చూడాలిగా!"

ఆవిడ తన నిర్ణయం ప్రకటించింది. దానికిక తిరుగులేదు!

సింహాద్రి ప్రాథేయపడ్డాడు. తన భార్య అనారోగ్యం గురించి, మందుల ఖర్చు గురించి బాధగా చెప్పుకున్నాడు... లాభం లేకపోయింది.

" సుక్కా !అమ్మగోరు, కడుపునిండా బువ్వెడతరు. సెప్పినట్టినుకో! నెల తిరక్కుండా, నా నెలుపొత్తాను గాదా!"

చుక్క తండ్రి వైపు బేలగా చూసింది.

సింహాద్రి చుక్కను మాకు అప్పగించాడు. వందరూపాయలు తీసుకుని, నెల రోజుల తరువాత తిరిగి వస్తానని, వంగి వంగి దణ్ణాలు పెట్టి వెళ్లి పోయాడు. చుక్క మా ఇంట్లోకి అలా అడుగు పెట్టింది.

చుక్క మా ఇంట్లోకి అడుగు పెట్టిన, మూడవ రోజు నుండి ఆవిడ సణుగుడు ప్రారంభమయింది.

" చుక్కా! నూతి చప్టా మీద అంట్ల గిన్నెలు పడున్నాయి. త్వరగా తోమి తీసుకురావే!" శ్రీమతి వంటగది లోంచి కేక పెడుతుంది.

చుక్క నూతి చప్టా మీదకు వెడుతుంది. ఒక గిన్నె పట్టుకుని తోముతూ గంట సేపయినా అలాగే కూర్చుంటుంది. నూతి వెనుక జామచెట్టు మీద దోరగా పండిన జామ కాయల్ని ఆశగా చూస్తుంది. ఆ కాయల్ని కొరికి తింటోన్న చిలకల్ని పలుకరిస్తుంది. తన చిన్ని చిన్ని కళ్ళు పెద్దవి చేసి నూతిలోకి తొంగి చూస్తుంది. నూతిలో ఈదుతున్న తాబేలును చూసి చప్పట్లు కొడుతుంది.

" ఒసేవ్!చీపురుతో గదులన్నీ తుడిచి... గుమ్మం ముందు నీళ్లు చల్లవే!"

చుక్క చీపురు కట్ట చేతిలోకి తీసుకుంటుంది. ఓ గది తుడుస్తూ రోడ్డు మీద సైకిలు తొక్కుతూ పోయే ఆడపిల్లల్ని ఆశ్చర్యంగా చూస్తుంది. మైమరచిపోతుంది. పని మరచిపోతుంది.

" చుక్కా! వీధిలో కుళాయి దగ్గర బిందెడు నీళ్ళ పట్టవే!"

చుక్కస్టీలు బిందెను తీసుకుని, కుళాయి వద్దకు వెడుతుంది. బిందెను క్యూలో పెడుతుంది. దాన్నక్కడే వదిలేసి వీధి చివర కాన్వెంటు ముందు డ్రిల్లు చేస్తోన్న పిల్లల్ని చూడటానికి ఆత్రంగా పరుగెడుతుంది. డ్రిల్లును కళ్ళు ఇంతగా చేసుకుని చూస్తూ కేరింతలు కొడుతుంది.

చుక్కా! వంశీ గాడ్ని కాస్సేపు ఎత్తుకుని ఆడించవే!"

చుక్క వంశీని సగం ఎత్తుకుంటుంది. "అమ్మగోరూ! సినబావు సేతు ల్లోంచి జారి పోతన్నడండీ!" అంటూ చాప మీదో మంచం మీదో పడుకోబెట్టేస్తుంది.

"ఏవండోయ్! చుక్క విషయంలో మనం పూర్తిగా మోస పోయాం. దీని కసలు పని చేత కాదు. రెండు పూటలా రెండు కంచాల అన్నం తింటోంది. ఏదైనా అడిగితే ముంగిలా మాట్లాడదు. తిండి పెట్టి దీన్నిక్కడ ఉంచుకోవడం శుద్ధ దండుగ. వింటున్నారా?"

ఆవిడ మాటల్ని విన్నాను. ఆ మాటల్లోని భావాన్ని అర్ధం చేసుకున్నాను. నిజమే. చుక్క కడుపునిండా తింటుంది... కాళ్ళు ముడుచుకుని పడుకుంటుంది. ఉదయం ఎండ వరండాలోకి ఎంత వచ్చినా, తట్టికొట్టి లేపితే గాని నిద్రలేవదు. శ్రీమతి చుక్కను మొదట ప్రేమగానే చూసింది. చింపిరి జుట్టుతో, పుసులు కట్టిన కళ్ళతో, పుచ్చిన పేలతో, అసహ్యంగా గొంగళి పురుగులా ఉందని, కుంకుడు కాయలు కొట్టించి, తలారా స్నానం చేయించింది. పేల దువ్వెన కొనిచ్చింది. అప్పటి కప్పుడు రెండు పాత చీరలు చింపి, రెండు జతల పరికిణీ జాకెట్లు కుట్టించి, తొడిగించింది. ఒక పౌడరు డబ్బా, తిలకం సీసా తెచ్చి ఇచ్చింది. దుప్పటి, దిండూ, చాపా ఇచ్చి వరండాలో ఒక మూల దాని పడకకు ఏర్పాట్లు చేసింది. ఎటొచ్చీ, చుక్క తిండి పోతూ, పని చేత కానిదీ అని తెలిసిన తరువాత ఆవిడ పట్టించుకోవడం మానేసింది. అంతతేదే కాదు, చుక్కని ఎంత త్వరగా వదిలించుకోవాలా అని ఆలోచించడం మొదలుపెట్టింది. చుక్క మా ఇంటికి వచ్చి నెల పూర్తి కావచ్చింది. చుక్క తండ్రి సింహాద్రి రాలేదు.

నేనో ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడ్ని, ఉదయం, సాయంత్రం అరుగు మీద కూర్చొని, అయిదారుగురు పిల్లలకు ప్రయివేట్లు చెప్పేవాడిని. చుక్క మీద శ్రీమతి తిట్లు, చీవాట్లు నా చెవిని పడేవి. ఇంట్లో ఎక్కడ ఉన్నా ఏ పని చేస్తున్నా చుక్క వెంటే నా చూపు కదిలేది.

" చుక్క చిన్న పిల్ల. దాని కింకా పని అలవడలేదేమో, తండ్రి ఏదో అవసరం కొద్దీ మనకు అప్పగించాడు. వాడొస్తే పంపించేద్దాం!" ఆవిడకు సర్ది చెప్పేవాడిని ఆగ్రహానికి అడ్డు కట్టలు వేసేవాడిని.

చుక్క అమాయకత్వం లోకం తెలియని తనం, మాట తీరు, పరాకు, ఏదైనా ?అడిగితే వెంటనే జవాబు చెప్పకపోవడం, చూసి నాకు జాలి కలిగేది. నిజానికి చుక్కది హాయిగా తిని, ఆడుకున్నంత సేపూ ఆడుకుని, బాల్యాన్ని అనుభవించాల్సిన వయసు. బడికి వెళ్లి చదువుకోవాల్సిన వయసు.

ఒక్కసారి చుక్క వంశీ గాడ్ని తన చేతుల్లోంచి 'దబ్' మని కిందకు జారవిడిచేసింది. అంతే, శ్రీమతి శివమెత్తిపోయింది. గుక్క పట్టి ఏడుస్తున్న వంశీని గచ్చు మీదే వదిలేసి,

పూనకం వచ్చిన దానిలా చుక్కని దబదబా బాదేసింది. నేను అడ్డుకున్నా ఆగలేదు. అన్ని దెబ్బలు కొట్టినా చుక్క ఏడవలేదు. అదేమిటో దాని కళ్ళలోంచి ఒక్క కన్నీటి చుక్కా రాలలేదు. ఒకటి రెండు నెలలయ్యాయి. రెండవ నెల దాటింది. మూడో నెల కూడా వెళ్ళిపోయింది. సింహాద్రి రాలేదు. చుక్కని తీసుకు వెళ్ళలేదు.

చుక్క రెండు పూటలా మెక్కుతోందని శ్రీమతి అక్కసు, ఉక్రోషం. నేను చాలాసార్లు గమనించాను. చుక్క అన్నంతినేటప్పుడు లోకంలోని ఆకలిఅంతా, దాని కడుపులోనే ఉన్నంత ఆబగా తింటుంది.

" అది ఎంత కాలంగా అన్నానికి మొహం వాచి ఉందో, పోనీలే తిననీ!". అంటే, శ్రీమతి నాపై విరుచుకుపడడం మామూలయింది.

" ఇదిగో మిమ్మల్నే! దీని వల్ల పూచిక పుల్లంత సాయం లేదు. ఇంటి ఖర్చులు పెరిగాయి. నెలకు పాతిక కేజీల బియ్యం అదనంగా అవసరమవుతున్నాయి. దీని బాబు ఏమైపోయాడో నాకు తెలియదు. ఒక పని చెయ్యండి. చుక్కని తీసుకువెళ్ళి చిత్రాడలో విడిచి రండి."

ఆవిడ మాటల్ని నేను ఎప్పుడూ కాదనను. కాదంటే జరిగే రగడ నాకు అనుభవైకవేద్యమే.

మర్నాడే చుక్కని స్కూటరు మీద కూర్చోబెట్టుకుని చిత్రాడ వెళ్ళాను. ఆవూరు చిన్నదే. చిత్రాడ చెరువు గట్టుమీద స్కూటరు ఆపాను.

" చుక్కా! మీరు ఉండేది ఎక్కడ?" మాట్లాడవేం? మీ అయ్యా, అమ్మా ఎక్కడ ఉంటారు?" అసహనంగా అడిగాను. " అయ్య ఏ వూరెల్లి పోనాడో... నా కెరిక నేదు."

ఎన్నిసార్లు అడిగినా చుక్క నుంచి అదే సమాధానం. అక్కడ అంబేద్కర్ విగ్రహం చుట్టూ కూర్చున్న కూలీలను అడిగాను. ఎవరూ సింహాద్రి గురించి చెప్పలేక పోయారు. చిత్రాడ రైల్వే గేటు ముందు, అటూ ఇటూ వరుసగా ఉన్న కొట్ల ముందు, గుడిసెల్లో, తోటలో ఉన్న పాడు బడ్డ సత్రంలో, సింహాద్రి గురించి విచారించాను.

సింహాద్రి ఆచూకీ దొరకలేదు. చుక్కను తీసుకుని ఇంటికి తిరిగి వచ్చాను. శ్రీమతి ముఖంలో మొసళ్ళూ, ముంగిసలూ తొంగిచూశాయి.

" సింహాద్రి ఏ వూరో వెళ్ళాడట. ఎప్పుడొస్తాడో తెలియదుట. అక్కడ చుక్క తాలూకు వాళ్ళెవరూ లేరు".

'మీ రేమీ వివరణ ఇవ్వనక్కరలేదు. నా కంటే, వంశీ కంటే అది మీకు ఎక్కువైపోయింది. ఎక్కడా లేని జాలి, ప్రేమ దాని మీద ఒలకబోస్తున్నారు.

'నిజమేనా?' నన్నునేను ప్రశ్నించుకున్నాను. నాకు నేనే, సమాధానపడ్డాను.

వాడెవడో దౌర్భాగ్యుడు. చుక్కని మాకు అప్పగించి వందరూపాయలు తీసుకుపోయాడు. వాడెప్పుడు వస్తాడో? అసలు వస్తాడో, రాడో?

" అది కాదోయ్! చుక్క ఇప్పుడు ఎక్కడకు పోతుంది? రేపు దాని తండ్రి వస్తే ఏం చెబుతాం? అర్థం చేసుకో!"

ఆవిడ నన్ను అర్థం చేసుకుంది. పర్యవసానంగా మా పక్కలు వేరు చేసింది.

మూడు పూటలు వంట చేయడం మానేసింది. రెండు సార్లు నాతో చెప్పకుండా పక్కింటి వాళ్లతో కలిసి మ్యాట్నీకి వెళ్లిపోయింది. నాకు పీకలు వరకు కోపం వచ్చింది. చుక్క బ్రతుకు నా నోరు నొక్కేసింది. మరో మూడు నెలలు గడిచిపోయాయి.

ఆవిడ చుక్కను ఛీదరించుకుంటూనే పనులు చెబుతోంది. సింహాద్రిని తిట్టని తిట్టులేదు. ఒక రోజు సాయంత్రం అరుగు మీద కూర్చొని పాఠాలు చెబుతున్నాను. "నానూ సదూకుంటా..." చుక్క నా ముందుకు వచ్చి కూర్చుంది. నాలో ఆలోచనల దుమారం.

ఏంవిటీ పిల్ల? పని పిల్లగా ఇంటికి వచ్చి చదువుకుంటా నంటుందేవిటి? ఆవిడసలే మండిపడి పోతోంది. దీని వల్ల కనీస ఉపయోగంలేదు. ఎక్కడో దాన్ని వదిలేసి రమ్మంటూ ఒకటే పోరు పెడుతోంది. ఏవిటి చేయడం?

అసలు చుక్కకు చదువుకోవాలన్న కోరిక ఎందుకు పుట్టింది? అరుగు మీద, పిల్లల్ని చూశా? అంతర్యంలో కోరిక, ఎప్పటి నుంచో అణచి పెట్టుకుందా...? పొద్దుట లేచింది. మొదలు, పొద్దుపోయే వరకూ విద్యార్థులకు పాఠాలు చెబుతునన్న వాడ్ని. అప్పుడప్పుడూ, 'అక్షరజ్యోతి,అందరికీ చదువు' కార్యక్రమాల్లో పాల్గొంటున్న వాడ్ని. చిన్నా, పెద్దా వయోజనుల వరకూ విద్యావసరం బోధిస్తున్న వాడ్ని. ఒక పని పిల్ల చదువుకుంటా నంటే, ఎలా స్పందించడం?

ఆ మర్నాడే చుక్కకు నేనో కొత్త పలక కొని తెచ్చాను.

ఈ విషయంలో శ్రీమతితో నేను పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. " పని పిల్లని పక్కన కూర్చోబెట్టుకుని పాఠాలు చెబుతున్నారా? అవ్వ! ఇదెక్కడయినా ఉందా?

నా మాటంటే మీకు లెక్కలేదన్నమాట?"

అవిడ దాడి ప్రారంభమయింది. నేను ఖాతరు చేయలేదు. చుక్క, రోజూ ఓ గంట సేపు నా దగ్గర అక్షరాలు నేర్చుకుంటోంది. చుక్క చదువు నన్ను విస్మయ పరుస్తోంది. చుక్క చదువులో చురుకుగా ఉంది. అ, ఆలు, మొదలుపెడితే అం, అః వరకూ రాసి పడేసింది. గుణింతాలు గబగబా నేర్చుకుంది. చిన్న చిన్న మాటల నుంచి వాక్యాల్లోకి వచ్చేసింది. చుక్క మట్టిలో మాణిక్యం. దానికి నేను కొంతైనా సానబెడుతున్నానా? చుక్క దుమ్ము ధూళిలో కలిసి పోయిన ఓ గడ్డి పూవు. దీన్ని శుభ్రపరచి కొంచెమైనా అక్షర పరిమళాన్ని అద్దుతున్నానా?

చుక్క చదువు నిర్విఘ్నంగా సాగిపోతుంది. చుక్క మా ఇంటికి వచ్చి సంవత్సరం నిండిపోతూంది. చుక్కను చూస్తోంటే చూడ ముచ్చటగా ఉంది. గొంగళి పుర్వుపా దశ నుంచి సీతాకోక చిలుకగా, రూపు దిద్దుకుంటోంది.

ఆ రోజు పిల్లల పరీక్ష పేపర్లు దిద్దటానికి కాకినాడ వెళ్లాను. పది రోజుల తరువాత తిరిగి వచ్చాను. ఇంట్లో చుక్క కనిపించలేదు. " చుక్క ఏదీ?" శ్రీమతిని మామూలుగా అడిగాను. ఆవిడ మాట్లాడలేదు. కోపంతో రెట్టించి అడిగాను. నా గొంతు నాకే వింతగా ధ్వనించింది.

"ఎందుకలా గొంతు చించుకుంటారు? ఏ వనుకుంటున్నారు మీరు? దాన్ని శాశ్వతంగా ఇంట్లో ఉంచుకుందామనుకుంటున్నారా? ఒక ఆడపిల్లను ఇంట్లో ఉంచుకుని పెంచడం అంత తేలి కనుకుంటున్నారా? వాడెవడో వంద రూపాయలకు ఆశ పడి దీన్నిక్కడ

వదిలేసి పోయాడు. భవిష్యత్తులో దీని బరువు, బాధ్యత ఎవరు మోస్తారు? దాని కిప్పుడు పదకొండో, పన్నెండో, వచ్చే ఏడు అది ఈడేరుతుంది. పెద్దదవుతుంది. ఎవరు సాకుతారు దాన్ని? దాని మంచీ చెడ్డా చూడటం నా వల్ల కాదు.!"

శ్రీమతి చెప్పిన విషయంలోనూ వాస్తవం ఉందా? నేనంత వరకూ ఆలోచించలేదా? "ఇంతకూ ఏం చేశావు దాన్ని? ఎక్కడకు పంపించేశావు?" చుక్క నా కళ్ళల్లో మెదులుతోంది.

" వీధిలో వాళ్లతో కలసి అన్నవరం సత్యదేవుడి ఉత్సవాలకు వెళ్లాను. అక్కడ కొండ మీద చుక్క ఎక్కడో తప్పిపోయింది."

"కాదు నువ్వే తప్పించేసి ఉంటావు. దాన్నక్కడ కావాలనే వదిలేసి వచ్చావు." నేనా మాటలు పైకి అనలేదు. అంటే సమాధానం ఏం వస్తుందో నాకు తెలుసు. సంవత్సరం పాటు ఈ ఇంట్లో పిల్లగా మసలిన చుక్క ఇక లేదనుకుంటే ఏదో వెలితిగా ఉంది. మనసులో, ఏమూలో విలవిలలాడుతోంది...

"రేపు దాని తండ్రంటూ వస్తే?" ఆ రోజే అన్నవరం బయలుదేరి వెళ్లాను. ఆవిడతో చెప్పలేదు. కొండమీద, మెట్లమీద, పంపానది రేవులో, జనం మధ్య, దేవ స్థానం సత్రాల వరండాల్లో, బస్ స్టాండులో, రైలుస్టేషన్లో.... అన్ని చోట్లా గాలించాను. ఎక్కడా చుక్క కనిపించలేదు.

పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసి, వెంటనే తిరుగు ముఖం పట్టాను. రైలెక్కాను., రైల్లోనూ ఎవరెవరో అడుక్కునే పిల్లలు, ఆకలీ, అంటూ చేయిచాస్తున్న వాళ్లు, అంగ వైకల్యంతో పాకుతూన్న వాళ్లు. రైలు పెట్టెల్ని తుడుస్తున్నవాళ్లు.

చుక్క వాళ్ల ముఖాల్లో కనపడుతోంది. ఏదో అశాంతి., అపరాధ భావం., చుక్క కోసం ఎందు కింత బాధ? ఎందు కింత ఆరాటం? ఆ పిల్ల నా కేమవుతుంది? పోలీస్ స్టేషన్లో ఆ ఇన్స్పెక్టరు ఏమన్నాడు? " పని పిల్లంటున్నారు. ఇంట్లోంచి వస్తువు లేవీ దొంగిలించలేదంటున్నారు. మీరింత శ్రద్ధగా ఆ పని పిల్లని వెదకటానికి కారణం ఏమిటి? ఆ పిల్లకూ, మీకు ఏమిటి సంబంధం? ఏదైనా వ్యవహారమా? చెప్పండి. సిగ్గుపడకండి. ఎందు కంటే ఆ పిల్లకు ఎవరూ లేరంటున్నారుగా?" అంటూ వెకిలిగా నవ్వాడు.

ఆ రక్షకాధికారి నవ్వు చూస్తోంటే ఏడవాలో, నవ్వాలో తెలయని స్థితి. లోకంలో అనాథ పిల్లలు ఎంత మంది లేరూ? రోడ్ల మీద, ఫుట్పాత్ల పైన, బస్స్టాండుల్లో, రైల్వే స్టేషన్లలో, ఎక్కడ చూస్తే అక్కడ, ఎండల్లో ఎండి, వానల్లో తడిసి, దుకాణాల అరుగుల మీద దొర్లి దొరికింది తిని, దొరక్కపోతే మాడి, దారిద్ర్యానికి, ఆకలికి ప్రతీకల్లా, జీవచ్ఛవాల్లా వాళ్లంతా ఎవరు? ఎక్కడ నుంచి పుట్టుకొస్తున్నారు? వీళ్లలో చుక్క కూడా ఒక అనాథ! అంతే.

మనసును సరి పుచ్చుకున్నాను. చుక్కను వెదికే ప్రయత్నం మానుకున్నాను. నిస్తేజంగా ఇంటికి తిరిగి వచ్చాను. ఇంటి ముందు రిక్షా దిగాను.

ఎదురుగా అరుగు మీద కూర్చుని చుక్క! చేతిలో వలకా, బలపం! ఆశ్చర్యం!అయోమయం! చుక్క ఎలా వచ్చింది? ఎవరు తీసుకొచ్చారు దీన్ని?

ఆవిడ గుమ్మం దగ్గర నిలబడి మా ఇద్దరి వైపూ కొరకొరా చూస్తోంది." దీన్ని వెదకడం కోసమేగా మీరు వెళ్లిందీ? పాపం! ఎంత బెంగ పెట్టుకున్నారో? ఒక సారి ఎత్తుకుని, హత్తుకుని ముద్దు లాడండి!"

శ్రీమతి మాటల్లోని వ్యంగ్యంతో గుండె పొరల్లోని తడి ఆవిరైనట్లయి మౌనంగా లోపలికి నడిచాను.

"రెండు అక్షరం ముక్కలు నేర్పారుగా, ఊరూ, పేరూ చెప్పిందట, ఎవరో గడ్డం ఉన్న డ్రైవరు, తన లారీ ఎక్కించుకుని ఈ వూళ్ళో దింపాడట, మీ పుణ్యమాని దానికి చాలా తెలివితేటలొచ్చాయి.

"మా అమ్మగారూ, చినబాబూ. అన్నవరం కొండమీద తప్పిపోయారు. ఎవరెత్తికెళ్లిపోయారో, ఏవిటో అర్జంటుగా వెళ్లి అయ్యగారితో చెప్పాలీ, అందట." నాకు నవ్వొచ్చింది. విచారమూ కలిగింది...

ఈవిడ దీన్ని కావాలని అన్నవరంలో వదిలేసి వస్తే వాళ్లేకొండ మీద తప్పిపోయారంటూ చెప్పడం అమాయకత్వమా, అక్షరజ్ఞానం తెచ్చిన వికాసమా? అజ్ఞానమే లేకపోతే, అక్కడే అన్నవరం మెట్ల మీద ముష్టి వాళ్లతో కలిసిపోయేదా - చుక్క?

"కొన్ని దరిద్రాలు వదిలించు కుందామన్నా వదలవు!" ఆవిడ సణుక్కుంటూ పెరట్లోకి వెళ్లింది. శ్రీమతి చెడ్డది కాదు. ఆవిడ మనస్తత్వం దారుణమైనదీకాదు. తను చుక్కని ద్వేషించడానికి కారణం వాడెవడో వందరూపాయలకు వదిలేసిపోవడమే, చుక్కకు పని చేతకాక పోవడమే, దాని బరువూ, బాధ్యతా మా నెత్తిన పడ్డాయి, అనుకోవడమే! మరోసారి...

శ్రీమతి చుక్కను వెంట బెట్టుకుని పుల్లేటికుర్రు పెళ్లికి వెళ్లింది. రెండు రోజులుండి తను ఒక్కతే తిరిగి వచ్చింది... నా చూపులు చుక్కని వెదికాయి.

" పెళ్లికి తణుకు నించి మా పెద్దమ్మ కూతురు, తులసి వచ్చిందండీ, దానికో పని పిల్ల కావాలని పదేపదే అడిగింది. పోనీలే అని చుక్కని పంపించాను."

"చుక్క ఇష్టపడే వెళ్లిందా?" "వెళ్ళక ఏం చేస్తుంది? దాన్ని మన మేమన్నా కన్నామా, పెంచి పోషించడానికి?"

"దాని తండ్రి మనకు అప్పగించి వెళ్లాడుగా?"

"వాడు దాని తండ్రో, ఏ తల మాసినవాడో?"

"ఆ తలమాసిన వాడే వచ్చి అడిగితే?"

"తణుకులో ఉంది. వెళ్ళి తీసుకు పొమ్మంటాను."

"అంటే.. చుక్క నీకు అవసరం లేదు."

"ఏవుంది? మూడు పూటలూ మెక్కి తినడానికీ, మీతో పాఠాలు చెప్పించుకోవడానికి తప్ప!"

" సరే ! ఇకనైనా మనశ్శాంతిగా ఉండు!"

నేను కోరుకున్న మనశ్శాంతి, శ్రీమతికి అయిదు రోజులు మాత్రమే దక్కింది. ఆరో రోజు, ఉదయం నిద్రలేచి తలుపులు తెరచి, బయటికి వచ్చేసరికి వీధి అరుగు మీద

ఒళ్లెరగని స్థితిలో ముడుచుకుని పడుకున్న చుక్క! ఈఇల్లు వెదుక్కుంటూ ఎలావచ్చిందో, ఎప్పుడొచ్చిందో, చిక్కిశల్యమై ముఖం పీక్కుపోయి, పరికిణీ జాకెట్టు మట్టి గొట్టుకుపోయి... చుక్కను తట్టి లేపాను. చేయి పట్టుకుని లోపలకు తీసుకువెళ్లాను.

చుక్కను చూడగానే ఆవిడ అసహనం హద్దులు దాటింది.

" శనిగొట్టు పీనుగా! నీబాబు చచ్చాడో, బ్రతికాడో, వస్తాడో, రాడో? ఈ ఇంట్లోంచి బయటకు పోవే! ఇక్కడ మాకెందుకు? బూజమ్మలా భోజనం లాగించడానికి తప్ప ఎందుకూ పనికిరావు!'' కోపంతో పిచ్చిగా అరిచింది.

చుక్కకు ఏదో ఒక పని చెప్పడం తనకే మాత్రం సంతృప్తిగా లేక పోయినా చెంపలు వాయించడం, నేను చూస్తూ ఊరుకోలేకపోవడం ఎంత కొట్టినా తిట్టినా చుక్క మాత్రం చలించదు ఆ పిల్ల కళ్లల్లో ఒక్క కన్నీటి చుక్కా రాలదు. చుక్కకు ఏడవడం చేతకాదు. బిగుసుకుపోయి నిలబడుతుంది. బేల కళ్ళతో జాలిగా చూస్తుంది. పలకా, బలపంతో నా ముందుకు తయారవుతుంది. చుక్క కారణంగా మా ఇద్దరి మధ్యా నిశ్శబ్ద యుద్ధం కొనసాగుతూనే ఉంది. చుక్కను నర్సీ పట్నం తీసుకుపోయి అప్పగించి రమ్మంటుంది. వాడెవడో నర్సీపట్నంలో ఉన్నాడో, నాగుల పట్నంలో ఉన్నాడో, ఎవడికి తెలుసు? నేను వెళ్లలేదు.

మనిషిగా ఆలోచించడం, మానవతా దృష్టితో చుక్కను వెనకేసుకు రావడం నా అసమర్ధత,అప్రయోజకత్వాలుగా , ఆవిడ ఎప్పుడో తీర్మానించేసింది.

చుక్కను వదిలించుకోవడానికి శ్రీమతి, ఇంకా చాలా ప్రయత్నాలు చేసింది. ఎన్ని చేసినా చుక్క మమ్మల్ని, మా ఇంటిని వదిలిపెట్టి వెళ్లింది కాదు!. నెలలు గడుస్తున్నాయి. ఋతువులు మారుతున్నాయి.

ఆవిడ తిట్ల వల్లనో... చదువు మీద శ్రద్ధ వల్లనో... అది తెచ్చిన వికాసం వల్లనో... చుక్కలో మార్పు వచ్చింది. పని అలవడింది. శ్రీమతి చెప్పిన పని శ్రద్ధగా చకచకా చేస్తోంది. తన బట్టలు తాను తరచూ ఉతుక్కుంటుంది. తల దువ్వుకుంటోంది. శుభ్రంగా తయారవుతోంది.

శ్రీమతి కళ్లల్లో ఆశ్చర్యం!

చుక్క ఇప్పుడు కాస్త ఒళ్లు చేసింది. రంగు తేలింది. అంతకు మించి చదువుకుంటోన్న తృప్తి ఆ పిల్ల ముఖంలో స్పష్టంగా కనపడుతోంది.

అదిగో అప్పుడే ఒక రోజు ఉదయం పది గంటల వేళ.... మా నమ్మకాల్ని వమ్ము చేసి, ఊహల్ని అపోహల్ని తారుమారు చేసి ఎక్కడి నుంచో, పిడుగులా ఊడిపడ్డాడు. సింహాద్రి!

నేను సింహాద్రిని సంభ్రమంగా చూశాను. శ్రీమతి చిత్తరువే అయింది.

సింహాద్రి నర్సీ పట్నం నుంచే వచ్చాడట. చుక్కను వెంటబెట్టుకు పోతాడట! నేను గాఢంగా నిట్టూర్చాను. చుక్క అనాథ కాదు. దానికో తండ్రి ఉన్నాడు. సంవత్సరం పైగా నేను అనుభవించిన అశాంతికి, అంతర్మథనానికి తెర దించబోతున్నాడు. స్వస్తి పలక బోతున్నాడు.

" నెల రోజులకి వస్తానన్న వాడివి. ఇంత కాలం ఏమయిపోయావు?"

ఇన్నాళ్ల చిరాకు, కోపం భళ్ళుమని, సింహాద్రి పై వెళ్లగక్కాను. సింహాద్రి రెండు చేతులూ

జోడించాడు. రెండు చెంపలూ వేసుకున్నాడు. కూటికి గతిలేని వాళ్ళం అన్నాడు. ఆడ దాని రోగం ముదిరిపోయి, కూలి పనులేవీ దొరక్క వారం రోజులకే, నర్సీ పట్నం తిరిగి వెళ్లి పోయాం అంటూ వాపోయాడు.. ఈ ఏడాది కాలంలో, పొట్ట కోసం, ఒక్క ఊరేంటి, పదూళ్ళకు పైగానే తిరిగాం అన్నాడు. కన్న బిడ్డకు కూడుపెట్టి పోషించలేకే మీ వద్ద వదిలేశాం బాబూ అంటూ బాధపడ్డాడు. మీలాంటి పెద్దోళ్ళ ఇంట్లో పడేశామన్న భరోసాతోనే, చుక్కని చూడటానికి రాలేదన్నాడు. వరుస బెట్టి కష్టాలమీద కష్టాలు ఏకరువు పెట్టుకున్నాడు. ఇంట్లో ఆడది ఇప్పుడు మంచం మీదున్నాదనీ, చుక్కనీ చూడాలని కలవరిస్తుందనీ, వెంటబెట్టుకుపోతాననీ కంట తడి పెట్టుకున్నాడు.

సింహాద్రి మాటలు నన్ను కదిలించాయి. ఆ మాటల్లోని నిజాయితీకి హృదయం ఆర్ద్రమైంది. అతని పేదరికపు దీనస్థితికి మనసు బాధగా మూల్గింది. ఆవిడ సింహాద్రికి టీ ఇచ్చింది, టిఫిను పెట్టింది, మధ్యాహ్నం సుష్టుగా భోజనం పెట్టింది. మనసులో ఏమనుకుందో, చుక్క గురించి ఒక్క మాటా ఫిర్యాదు చేయకుండా, కూడా చుక్కను పంపించెయ్యడానికి రంగం సిద్ధం చేసింది.

శ్రీమతి చుక్క చేతికి, నూట ఏభై రూపాయలు, పాత బట్టలు ఇవ్వ బోయింది. చుక్క తీసుకోలేదు. శ్రీమతి నా వైపు చూసింది. " చుక్కా! ఆ డబ్బులు , బట్టలూ తీసుకో! మీ అయ్య వచ్చాడుగా! మీ వూరెల్లిపో!" నేను అనునయంగా అన్నాను. చుక్క అడ్డంగా తలవూపింది.

ఆవిడ డబ్బులు, పాత బట్టలు సింహాద్రి చేతిలో పెట్టింది. చుక్క సింహాద్రి వైపు చూసింది. చూపు మార్చి మా వైపు చూసింది.

" ఆడు నా అయ్య గాదండి" చుక్క గొంతు స్ఫుటంగా పలికింది. నా గుండె గతుక్కు మంది... శ్రీమతి చేష్టలుడిగిపోయింది.

"సింహాద్రి చుక్క తండ్రి కాడా?"

"కన్న బిడ్డ... మీ కళ్లముందే, ఆడు నా అయ్య గాదని సెప్పి నాదంటే, నానేటి సెయ్యాల? ఏ నూతిల్ల దూకాల? ఏ సెరువుల్ల దిగాల? ఏ సంద్రంల పడాల? నిజింవే, నాను సుక్కకి అయ్యను గాదు బావూ! అయ్యనూ గాదూ! ఆకలికి నాను అయ్యను గాదా? దరిద్రానికి నాను అయ్యను గాదా? అయ్యను గాదా?"

సింహాద్రి లబోదిబో మంటున్నాడు. నెత్తిమీద చేతులతో కొట్టుకుంటున్నాడు.

చుక్క కావాలనే అబద్ధం చెప్పిందా? ఎందుకనీ? కన్న తండ్రినే కాదన్నదీ అంటే....

"ఇక్కడ మూడు పూటలు తిన మరిగిందిగా! అయ్యనూ కాదంటుంది - అమ్మనూ కాదంటుంది... నువ్వు తీసుకు పో సింహాద్రీ!" శ్రీమతి ఆజ్ఞ జారీచేసింది.

సింహాద్రి చుక్క చేయి పట్టుకుని బరబరా బయటకు లాక్కు పోతున్నాడు.

చుక్క ఏడుస్తోంది... ఏడుస్తూ వెక్కి వెక్కి పడుతోంది... వెనక్కి తిరిగి చూస్తోంది. తొలిసారిగా, ఆ పిల్ల కళ్ల నుంచి కన్నీటి చుక్కలు రాలి పడుతున్నాయి.

నేను నిర్లిప్తంగా, నిశ్చేతనగా..!

అరుగు మీద పలకా బలపం.

" చుక్కా! చుక్కా!" అంటూ పిలుస్తున్నాయి. నన్ను వెక్కిరిస్తున్నాయి!

❀ ❀ ❀ ❀ ❀ ❀ (ఆంధ్రప్రభ... కథాప్రభ... 2.7.1997